




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 50 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా బుధవారం 4 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 50 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, WED MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ..

## సుదీర్ఘంగా చర్చలు జరిపిన నేతలు

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్
- గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ
- జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్ళించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై కూడా సమీక్షించారు.త్వరలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇరువురు నేతలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.



## నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- సీఎం మార్పుపై ఇప్పటివరకూ చర్చించలేదని స్పష్టీకరణ
- పార్టీలో విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్షాల కుట్ర అంటూ ఆరోపణ
- కాంగ్రెస్‌లో అసమ్మతి లేదు.. అంతా ఐక్యంగా ఉన్నామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి మార్పు, నాయకత్వలేమిపై వస్తున్న వార్తలకు డిప్యూటీ సీఎం డి.కె. శివకుమార్ (డీకే) తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు.

- మిగతా2లో



## జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప ముఖ్యమంత్రి
- ఈ నెల 5న తన కుమారుడి వివాహానికి రావాలంటూ ఆహ్వానం
- శుభాకాంక్షలు తెలిపిన జగన్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు

- మిగతా2లో



## రూ.100 కోట్ల ఆలయ భూమి కబ్జా అయింది

- అనకాపల్లిలోని కన్యాకాపరమేశ్వరి ఆలయ భూమి కబ్జా అయిందన్న గుడివాడ
- భూ కబ్జాపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- చంద్రబాబు ఆధ్వర్యంలో ఒక దొంగల ముఠా ఏర్పడిందని ఆరోపణ

- మిగతా2లో

## జోగి రమేశ్ ను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు

- జోగి రమేశ్ ఇంటిపై దాడులు జరుగుతుంటే పోలీసులు సైలెంట్ గా ఉన్నారన్న బుగ్గన
- నేరస్తులకు రక్షణ కల్పిస్తున్నారా అని ప్రశ్న
- అంబటిపై తప్పుడు కేసులు పెట్టారని మండిపాటు
- అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వ్యాఖ్య
- చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలని సూచన




రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్ఠకు చేరాయని వైసీపీ నేత, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసానికి వెళ్లిన బుగ్గన ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ...

- మిగతా2లో

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది...

### ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను





- ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ వాయుసేన, నావికాదళం, రక్షణ వ్యవస్థలు ధ్వంసమైనట్లు వెల్లడి
- ఆ దేశ నాయకత్వం కూడా తుడిచిపెట్టుకుపోయిందన్న అమెరికా అధ్యక్షుడు

మిగతా 2లో

## ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

- భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడి
- గల్ఫ్ దేశాల మీద జరుగుతున్న దాడులపై ప్రధాని ఆందోళన
- చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్న విదేశాంగ శాఖ



మిగతా 2లో


## సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- ఉండవల్లిలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ
- చంద్రబాబుతో సమావేశం అనంతరం పవన్ ప్రకటన
- గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపిన వైనం
- ఆర్థిక కష్టాల్లోనూ పంచాయతీలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ, పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నా రంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత మరువలేనిదని

మిగతా 2లో





## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు

- స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన లోకేశ్
- శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక ఆశీస్సులు పొందిన మంత్రి దంపతులు
- ఘనంగా స్వాగతం పలికిన ఆలయ అధికారులు, స్థానిక నాయకులు

మిగతా 2లో

## పశ్చిమాసియా రణరంగం


### అమెరికా ఎంబసీలను టార్గెట్ చేసిన ఇరాన్

- సౌదీలోని అమెరికా దౌత్య కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ల దాడి
- బహ్రెయిన్, ఒమన్‌లలోని అమెరికా స్థావరాలపైనా విరుచుకుపడ్డ ఇరాన్
- టెహ్రాన్, బీరుట్ లలో కొనసాగుతున్న ఇజ్రాయెల్ విధ్వంసకాండ
- అంతర్జాతీయంగా ఆకాశాన్నంటుతున్న గ్యాస్ ధరలు



**పెన్ పవర్ డెస్క్:**మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కూటమి దాడులతో ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇరాన్ తీవ్రస్థాయిలో దాడులు చేస్తోంది. ముఖ్యంగా అమెరికా దౌత్య కార్యాలయాలు, సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుని ఇరాన్


మిగతా 2లో



## భారతీయ క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు

- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సంస్థలు మన క్రియేటర్లను దోచుకుంటున్నాయన్న విజయసాయి
- ఇన్‌స్టాగ్రామ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని మండిపాటు
- మనకు ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉండాలని వ్యాఖ్య

మిగతా 2లో




## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

- దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో భూకంపం
- రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో కంపించిన భూమి
- గెరాష్‌కు 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం

మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు: ట్రంప్ సుదీర్ఘ దాడుల వ్యూహం ఏమిటి?

మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు రేగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' తర్వాత పరిస్థితులు వేగంగా మారాయి. రియాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంపై ఇరాన్ డ్రోన్ల దాడి జరిగినట్టు వచ్చిన సమాచారం నేపథ్యంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు యుద్ధం త్వరలో ముగిసే సూచనలు కనిపించడం లేదనే సంకేతాలు ఇస్తున్నాయి. "మా ప్రతిస్పందన ఏమిటో త్వరలో తెలుస్తుంది" అన్న ఆయన వ్యాఖ్యలు సుదీర్ఘ సైనిక వ్యూహానికి నాంది పలికినట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ పరిణామాలకు ఆయువులా నిలిచింది ఇరాన్ అణు కార్యక్రమమే. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని పూర్తిగా అంగీకరించబోమని అమెరికా స్పష్టం చేస్తుండగా దీర్ఘ పరిధి క్షిపణులు అమెరికా స్థావరాలు.. మిత్రదేశాలకు ముప్పుగా మారుతున్నాయనే ఆందోళన వాషింగ్టన్‌లో పెరుగుతోంది. ఇరాన్ సైనిక వ్యవస్థను బలహీనపరచడం.. ముఖ్యంగా దాని మిసైల్ సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యమని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ఇక ఇరాన్ వైపు చూస్తే సుప్రీం లీడర్ ఖమేనీ మరణించినట్టు వచ్చిన వార్తలు దేశంలో రాజకీయ అనిశ్చితిని మరింత పెంచాయి. నాయకత్వ శూన్యత మధ్య ఇరాన్ సైన్యం, ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) ప్రతిదాడులతో తన స్థైర్యాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తోంది. యూఏఈ, ఖతార్ ప్రాంతాల్లోని అమెరికా స్థావరాలపై జరిగిన దాడుల్లో అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం రావడంతో అమెరికా మరింత కఠిన వైఖరిని అవలంబించే అవకాశం ఉంది. ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య పరిమితం కాదు. గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. చమురు ఉత్పత్తి, సరఫరా మార్గాలు, హోర్ముజ్ జలసంధి భద్రత వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. చమురు ధరలు పెరగడం వల్ల గ్లోబల్ ఇన్ఫ్లేషన్ మళ్లీ ఎగసిపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే మార్కెట్లు అస్థిరంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ రాజకీయ రంగంలోనూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. యురోపియన్ యూనియన్ శాంతి చర్చలకు మద్దతు తెలుపుతూ అణు విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు రష్యా, చైనా వెంటనే దాడులు ఆపాలని పిలుపునిచ్చాయి. ఒమాన్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరగబోయే చర్చలు కీలక మలుపు తిప్పే అవకాశమున్నప్పటికీ యుద్ధభూమిలో జరుగుతున్న పరిణామాలు దౌత్యపరమైన ప్రయత్నాలను బలహీనపరుస్తున్నాయి.

ట్రంప్ మరో నాలుగు నుంచి ఐదు వారాలు దాడులు కొనసాగవచ్చని చేసిన ప్రకటన యుద్ధ వ్యూహం ముందుగానే సిద్ధంగా ఉన్నట్టు సూచిస్తోంది. ఇది కేవలం ప్రతీకార దాడి కాద.. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని వ్యవస్థాత్మకంగా కుదించే లక్ష్యంతో రూపొందించిన సుదీర్ఘ ఆపరేషన్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీర్ఘకాల యుద్ధం అమెరికా లోపల కూడా రాజకీయ ప్రభావాలను చూపవచ్చు. సైనిక నష్టం, ఆర్థిక భారం, అంతర్జాతీయ ఒత్తిళ్లు.. ఇవి కలిసి వాషింగ్టన్ నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశముంది. మొత్తానికి ఈ సంక్షోభం మధ్యప్రాచ్య భద్రతా సమీకరణాలను పూర్తిగా మార్చే దిశగా సాగుతోంది. అణు కార్యక్రమం, ప్రాంతీయ ఆధిపత్యం, మిత్రదేశాల భద్రత.. ఇవన్నీ ఈ మూడు అంశాల చుట్టూ తిరుగుతున్న ఈ యుద్ధం త్వరగా ముగిసే సూచనలు లేవు. దౌత్య మార్గాలు తెరిచి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో సైనిక చర్యలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వచ్చే కొన్ని వారాలు గ్లోబల్ రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థలకు కీలక పరీక్ష కాలంగా మారనున్నాయి.

## ఇరాన్... ఓ వైపు యుద్ధం, మరోవైపు భూకంపం

ఒకవైపు అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతుం డగా, మరోవైపు ఇరాన్‌లో భూకంపం సంభవించింది. దక్షిణ ఇరాన్‌లోని గెరాష్ ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ భూకంపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం గురించి వివరాలు తెలియాల్సి ఉంది. గెరాష్‌కు ఉత్తర వాయువ్య దిశలో 55 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై 4.3 తీవ్రత నమోదు కావడంతో ఈ భూకంపాన్ని తేలికపాటి నుంచి మధ్యస్థాయి భూకంపంగా తెలిపారు. భూకంపం వచ్చిన ప్రాంతం ఎక్కువగా గ్రామీణ ప్రాంతం. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగు పెట్టారు. ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ కాలేదు.

# పశ్చిమాసియా రణరంగం

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడుతోంది. యుద్ధం నాలుగో రోజుకు చేరుకోగా.. ఇరాన్ తన వ్యూహాన్ని మార్చింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్ లో ఉన్న అమెరికన్ ఎంబసీపై రెండు డ్రోన్లతో దాడి చేసింది. ఈ ఘటనలో ఎంబసీ ఆవరణలో మంటలు చెలరేగగా, భవనానికి స్వల్ప నష్టం వాటిల్లింది. దౌత్య కార్యాలయాలపైనే నేరుగా దాడులు జరగడం యుద్ధ తీవ్రతను తెలియజేస్తోంది. మరోవైపు ఒమన్‌లోని దుక్మ్ పోర్ట్‌పై కూడా డ్రోన్ దాడి జరగడంతో ఇంధన ట్యాంక్ దెబ్బతింది. అలాగే బహ్రెయిన్‌లోని అమెరికన్ ఎయిర్ బేస్‌లో ఉన్న ఓ కమాండ్ భవనాన్ని పూర్తిగా ధ్వంసం చేశామని ఇరాన్ మీడియా ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో నౌకలను మంటల్లో కలిపేస్తామంటూ ఇరాన్ అధికారులు హెచ్చరించారు. మరోవైపు ఇజ్రాయెల్ తన దాడులను ఏమాత్రం తగ్గించడం లేదు. ఇజ్రాయెల్ వైమానిక దళం మంగళవారం కూడా టెహ్రాన్‌లోని సైనిక లక్ష్యాలపై విరుచుకుపడింది. టెహ్రాన్ తూర్పున ఉన్న పార్డిస్ ప్రాంతంలో భారీ పేలుళ్లు సంభవించగా, నగరం మొత్తం పొగతో నిండిపోయింది. ఇజ్రాయెల్ అటు లెబనాన్ రాజధాని బీరుట్ దక్షిణ శివార్లలోనూ భవనాలను నేలమట్టం చేస్తోంది. దీనికి దీటుగా హిజ్బుల్లా కూడా గోలాన్ హైట్స్, మెరాన్, రమత్ డేవిడ్ వైమానిక స్థావరాలపై క్షిపణి దాడులు చేసింది. ఈ యుద్ధం కారణంగా సామాన్యులు బలవుతున్నారు. ఇరాన్‌లో ఇప్పటివరకు 787 మంది మరణించగా, అందులో 176 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. అటు అమెరికా వైపు ఆరుగురు సైనికులు మరణించారు.

అమెరికా సైనికుల మరణాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ కూడా ధృవీకరించింది. ఖతార్, సౌదీలో చమురు ఉత్పత్తికి అంతరాయం కలగడంతో అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధరలు భగ్గుమంటున్నాయి. సోమవారం 50 శాతం పెరిగిన ధరలు, మంగళవారం మరో 33 శాతం పెరిగి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం చేస్తామని అమెరికా మంత్రి మార్కో రుబియో హెచ్చరించగా, టెహ్రాన్‌పై పూర్తి శక్తితో విరుచుకుపడతామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి స్పష్టం చేశారు.

# రూ.100 కోట్ల ఆలయ భూమి కబ్జా అయింది

సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేసే నేతలు, కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములు కబ్జా అవుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ప్రశ్నించారు. అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న కన్యకాపరమేశ్వరి దేవాలయానికి చెందిన భూములు అక్రమంగా బదలాయించారంటూ ఆయన మండిపడ్డారు. వందేళ్ల క్రితం దాతలు కన్యకాపరమేశ్వరి ఆలయానికి 2 ఎకరాల 49 సెంట్ల భూమిని దానంగా ఇచ్చారని... అందులో ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ కోసం కొంత తీసుకోగా, మిగిలిన 1 ఎకరా 11 సెంట్ల స్థలం ప్రస్తుతం ఉందని అమర్నాథ్ తెలిపారు. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని ఆయన వెల్లడించారు. దేవాదాయ శాఖకు చెందిన ఈ విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే అధికారం అధికారులకు ఎక్కడిదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూమిని ప్రైవేట్ స్థలంగా చూపుతూ అధికారులు ఏ ప్రాతిపదికన నివేదిక ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఒక 'దొంగల ముఠా' ఏర్పడిందని, కూటమి నేతల అండతో ప్రభుత్వ, దేవాదాయ భూములను ఈ ముఠా దోచుకుంటోందని ఆరోపించారు. రూ.100 కోట్ల విలువైన ఈ భూమి ఇప్పటికే కౌలుదారుల పేరు మీదకు మారిందని, ఈ భారీ కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని అమర్నాథ్ డిమాండ్ చేశారు.

### జోగి రమేశ్ ను పరామర్శించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి..

# కూటమి ప్రభుత్వంపై విమర్శలు

జోగి రమేశ్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాంబులతో దాడులు జరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా, దాడులు చేసే వారికి ఎస్కార్ట్ ఇవ్వడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా లేక నేరస్థులకు రక్షణ కల్పిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ దాడులను మహిళలు ముందుండి నడిపించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నడూ చూడని కొత్త సంస్కృతి అని ఆయన అన్నారు. మహిళలతో అసభ్యకరంగా మాట్లాడించడం, దాడులు చేయించడం వెనుక పెద్దల 'కోచింగ్' ఉందని ఆరోపించారు.

మాజీ మంత్రి అంబటి రాంబాబు తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పటికీ, ఆయనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని బుగ్గన తప్పుబట్టారు. బాధితులపైనే కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవాన్ని రాష్ట్రం కోసం ఉపయోగించాలి కానీ, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడానికి కాదని అన్నారు.

# ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది...

యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం తీవ్ర

స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన పునరుద్ఘాటించారు.

# ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒమన్ సుల్తాన్, కువైట్ యువరాజుతో ఫోన్‌లో సంభాషించారు. గల్ఫ్‌లో కొనసాగుతున్నసంఘర్షణ, ఈ ప్రాంతాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. కువైట్ యువరాజు సబా అల్ ఖలీద్ అల్ సబాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై జరుగుతున్న దాడుల మీద ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒమన్ సుల్తాన్‌తోనూ ప్రధాని మోదీ మాట్లాడారని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిస్తోందని

విదేశాంగ మంత్రిత్వ శాఖ పునరుద్ఘాటించింది. ఇరుపక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను నివారించాలని కోరింది. పౌరుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది.

## సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

ఆయన పేర్కొన్నారు. మంగళవారం నాడు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జరిగిన ఈ భేటీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూఎస్, అటవీ శాఖలకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. ప్రధానంగా జల్ జీవన్ మిషన్ పనుల పురోగతి, నిధుల వినియోగం, గ్రామీణ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయడం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. నియోజకవర్గాల వారీగా జరిగిన నిధుల కేటాయింపులపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు సీఎం పలు విలువైన సూచనలు చేశారని పవన్ తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన 'మేజిక్ డ్రెయిన్ల' పనితీరును పవన్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని పంచాయతీల్లో ఈ తరహా డ్రెయిన్లను నిర్మించడం ద్వారా పారిశుధ్య నిర్వహణను మరింత పకడ్బందీగా అమలు చేయవచ్చని వివరించారు. అలాగే, సాగునీటి పారుదల శాఖ పరిధిలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులను వేసవిలోనే పూర్తి చేయాలని, దీనివల్ల పంటలు వేసే సమయానికి రైతులకు ఇబ్బందులు ఉండవని కోరారు. అటవీ శాఖ చేపట్టిన 'హనుమాన్ ప్రాజెక్ట్' వివరాలను కూడా పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా సీఎం సూచనలను పాటిస్తూ ముందుకు సాగుతామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# నేను, సిద్ధరామయ్య పాలు, తేనె లాంటి వాళ్లం

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీలో పూర్తి ఐక్యత ఉందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన అనుబంధం 'పాలు–తేనె' లాంటిదని ఆయన అభివర్ణించారు. మంగళవారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన డీకే శివకుమార్.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీఎం సిద్ధరామయ్య ఇచ్చిన వివరణను సమర్థించారు. విపక్ష నాయకులు రాజకీయ దురుద్దేశంతోనే ఈ ఆరోపణలు చేస్తున్నారని, సీఎం అనుభవంతో మాట్లాడారని కొనియాడారు. "మా ఇద్దరి మధ్య బంధం పాలు–తేనెలా కలిసిపోయింది. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవి మార్పుపై ఇప్పటివరకూ ఎలాంటి చర్చ జరగలేదని డీకే స్పష్టం చేశారు. అలాగే, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) అధ్యక్షుడిగా తాను ఆరేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మార్చి 10న ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేపీసీసీ అధ్యక్ష పదవిలో తన కొనసాగింపుపై స్పందిస్తూ.. కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరాధారమైనవని సీఎం సిద్ధరామయ్య ఇదివరకే కొట్టిపారేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ మధ్య విభేదాలు సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, కానీ తాము పార్టీ హైకమాండ్‌కు కట్టుబడి ఉన్నామని ఇద్దరు నేతలు మరోసారి స్పష్టం చేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ ఛైర్మన్ మార్పు విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డీకే తెలిపారు.

# జగన్‌ను కలిసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

- మొదటి పేజి తరువాయి

భట్టివిక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు విక్రమాదిత్య వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జగన్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వధూవరులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. కాగా, తన కుమారుడి వివాహానికి రాజకీయ ప్రముఖులను ఆహ్వానిస్తూ భట్టివిక్రమార్క ఆహ్వాన పత్రికలు అందిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి లోకేశ్ దంపతులు


మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి బ్రహ్మణి పాల్గొన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన శ్రీవారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న లోకేశ్, బ్రహ్మణి దంపతులకు దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన స్వామివారి కల్యాణాన్ని వారు భక్తిశ్రద్ధలతో తిలకించారు. కార్యక్రమం ముగిశాక వేద పండితులు మంత్రి దంపతులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ పవిత్రమైన కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంగళగిరి క్షేత్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## భారతీయ క్రియేటర్ల శ్రమను దోచుకుంటున్నారు

సోషల్ మీడియా వేదికలపై రాత్రింబవళ్లు శ్రమించి కంటెంట్‌ను సృష్టిస్తున్న భారతీయ క్రియేటర్లకు దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారతీయుల ప్రతిభను తక్కువ ధరకు వాడుకుంటూ, ప్రకటనల ద్వారా వచ్చే భారీ ఆదాయాన్ని తమ జేబుల్లో వేసుకుంటున్నాయని మండిపడ్డారు. యూట్యూబ్ వంటి సంస్థలు ప్రకటనల ఆదాయంలో 55 శాతం క్రియేటర్లకు ఇస్తుండగా, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు క్రియేటర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. విదేశీ సంస్థలు తమ ధోరణిని మార్చుకోని పక్షంలో, భారతదేశానికే సొంతంగా ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఉండాలని ఆయన ప్రతిపాదించారు. 'భారత్ టాక్సీ' లాంటి స్వదేశీ ప్రత్యామ్నాయాల మాదిరి, ఒక స్వదేశీ సోషల్ మీడియా యాప్ ఉంటే మన దేశ సంపద విదేశాలకు పోకుండా ఉండటమే కాకుండా, క్రియేటర్లకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని విజయసాయి రెడ్డి కోరారు. గతంలో అశ్వినీ వైష్ణవ్ క్రియేటర్ల పక్షాన మాట్లాడిన విషయాన్ని గుర్తుచేస్తూ, వారి ఆర్థిక భద్రత, హక్కుల కోసం కఠినమైన చట్టబద్ధ నిబంధనలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ క్రియేటర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ రంగంలో లేదా స్వదేశీ భాగస్వామ్యంతో కొత్త ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియాలో క్రియేటర్లే వెన్నెముక అని, వారి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు.

## కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం తాత్కాలిక మూసివేత

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 03: పల్నాడు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం చంద్రగ్రహణం కారణంగా మంగళవారం తాత్కాలికంగా మూసివేసినట్లు ఆలయ అర్చకులు మరియు దేవస్థాన అధికారులు తెలిపారు. గ్రహణ సమయమంతా ఆలయ ద్వారాలు మూసివేయబడినట్లు దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. గ్రహణం అనంతరం సంప్రదాయ ఆగమ శాస్త్ర నియమావళి ప్రకారం శుద్ధి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, బుధవారం ఉదయం 8 గంటలకు ఆలయాన్ని తిరిగి తెరిచి స్వామి వారి దర్శనాలు ప్రారంభిస్తామని దేవస్థానం అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి దేవస్థానానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు



పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా । ఎన్.టి.ఆర్. జిల్లా । గుంటూరు జిల్లా । పల్నాడు జిల్లా । బాపట్ల జిల్లా

# నరసరావుపేట మెప్మా స్కామ్‌లో అరెస్టులు

### నరసరావుపేటలో మెప్మా వ్యవహారంలో అరెస్టు రూ. 9 కోట్ల అక్రమాలు వెలుగులోకి

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 03: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో మున్సిపల్ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కార్యక్రమం పరిధిలో భారీ ఆర్థిక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. నకిలీ స్వయం సహాయక సంఘాలను సృష్టించి సుమారు తొమ్మిది కోట్ల రూపాయలను వివిధ బ్యాంకుల నుండి అక్రమంగా పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అఖిల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా నరసరావుపేట ఒకటవ పట్టణ పోలీస్ అధికారులు ఎనిమిది మంది సంబంధిత సిబ్బందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఐదవ నిందితురాలిగా ఉన్న గుడికందుల భూదేవిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి నరసరావుపేట న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆమెకు రిమాండ్ విధించింది. దర్యాప్తులో భాగంగా నిందితులు నకిలీ సంఘాలను సృష్టించి, వివిధ బ్యాంకుల ద్వారా కోట్ల రూపాయల రుణాలను అక్రమంగా పొందినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కొందరు బ్యాంకు సిబ్బంది కూడా సహకరించినట్లు ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ అక్రమాల్లో పాత్ర ఉన్న మిగిలిన వారిని త్వరలో అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడించబడతాయని పోలీస్ లు తెలిపారు. మీకు కావాలంటే ఇంకా అధికారిక ప్రభుత్వ శైలిలో లేదా మరింత ఘాటుగా వార్తా శైలిలో కూడా సిద్ధం చేసి ఇస్తాను

# ఈ నెల 5 నుండి 8 మధ్యాహ్నం వరకు గుండాల పండుగ, పాస్టర్ జాన్ వెస్లీ వెల్లడి...

పెన్ పవర్, గుంటూరు, మార్చి, 03.
హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 49వ అంతర్జాతీయ గుడారాల పండుగను అమరావతి మండలం లేమల్లెలో నిర్వహించనున్నట్లు పాస్టర్ జాన్ వెస్లీ తెలిపారు..
లేమల్లె లోని హోసన్న దయాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుండి ఎనిమిదవ తేదీ వరకూ నిర్వహించనున్న ఈ గుడారాల పండుగను 150ఎకరాల సువిశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు...నాలుగు రోజులపాటు అత్యంత ఆశ్చర్యకరంగా నిర్వహించనున్న ఈ పండుగకు రాష్ట్ర వ్యాప్తంగా.,ప్రత్యేకించి విశాఖ., కాకినాడ., ద్రోన్., నర్సాపూర్ సహా పలు ప్రాంతాలనుండి వచ్చే రైళ్లలో ప్రత్యేక బోగీలను రైల్వేశాఖ ఏర్పాటు చేయడం జరిగిందని., అదే విధంగా గుంటూరు బస్ స్టేషన్ కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ వద్ద నుండి హోసన్నా మందిర్ దయాక్షేత్రం వరకూ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని., అంతే కాకుండా దయాక్షేత్రం వద్దనే ప్రత్యేక రైల్వే కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు...గత ఉపవాస ప్రార్థనలకు మూడు లక్షలకు పైగా విశ్వాసులు హాజరయ్యారని.,ఈ సారి జరగబోయే ఉపవాస ప్రార్థనలకు అంతకుమించి విశ్వాసులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా 10వేల మంది వాలంటీర్లతో పర్యవేక్షణ., శానిటేషన్ కోసం మరో 5వేలమంది వాలంటీర్లతో ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నట్లు వారు



వెల్లడించారు...దేశ నలుమూలల నుండి విశ్వాసులు హాజరై దేవుని కృపను పొందాలని వారు పిలుపునిచ్చారు...ఈ సమావేశంలో పాస్టర్ అనిల్., పాస్టర్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు...

# రేణుక ఎల్లమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరించిన డిఎస్పి

జహీరాబాద్ పెన్ పవర్
ఝరాసంగం మండలం పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాల పోస్టర్‌ను జహీరాబాద్ డిఎస్పి సైద్ నాయక్ ఆవిష్కరించారు. మార్చి 04, 06, 08 తేదీలలో జరిగే ఈ జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డిఎస్పిని ఉత్సవ కమిటీ సభ్యులు మాణిక్ పాటిల్, వెంకటేశం ఘనంగా సన్మానించి, జాతరకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ... ఆధునిక కాలంలో కూడా నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువత ఫోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమలోని కళా ప్రతిభను వెలికితీయాలని సూచించారు.

**జాతర కార్యక్రమ వివరాలు ఇలా ఉన్నాయి:**

మార్చి 04 (బుధవారం): అమ్మవారికి అభిషేకం, సాయంత్రం బోనాలు, ఎల్లమ్మ నాటకం భాగం మార్చి 06 (శుక్రవారం): నిత్య పూజలు, సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎల్లమ్మ నాటకం భాగం 2 మార్చి 08 (ఆదివారం): ప్రత్యేక పూజలు, ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటకం భాగం 3 (ముగింపు)గత 32 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న ఈ జాతర ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ పెద్దలు, గ్రామస్తులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.




## ఇది కూటమి పాలన...అనారోగ్యానికి భయపడాల్సిన అవసరం లేదు... ఎమ్మెల్యే నశీర్ అహ్మద్..

బపెన్ పవర్, గుంటూరు, మార్చి, 03.
ముఖ్యమంత్రి నార చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరూ అనారోగ్యానికి భయపడే పరిస్థితి లేదని చెప్పడానికి గర్వపడుతున్నాం. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.40 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు స్థానిక మా కార్యాలయంలో పంపిణీ చేశాం. కేవలం 18 నెలల కాలంలో



గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సీఎం సహాయనిధి ద్వారా 9. 67 కోట్ల విలువైన చెక్కులను అందించాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాం. పేదలకు వైద్యం అందలేదనే పరిస్థితి రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాం రాష్ట్రంలో విద్య వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూనే సంక్షేమం , అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం. రాష్ట్రంలో గూగుల్ వంటి పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టడం ద్వారా నిరుద్యోగ యువత భవితకు బంగారు బాటలు వేస్తున్నాం

## మొబైల్ కోర్టుకు వాయిదా నిమిత్తం హాజరైన మాజీమంత్రి అంబటి...

బపెన్ పవర్, గుంటూరు, మార్చి, 03.
ముఖ్యమంత్రి నీ దూషించిన కేసులో స్పెషల్ మొబైల్ కోర్టుకు వాయిదా నిమిత్తం హాజరైన మాజీమంత్రి అంబటి రాంబాబుగత నెల 31వ తేదీన అంబటి రాంబాబు పై ముఖ్యమంత్రిని దూషించినందుకు కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులుఈ కేసులో 18 రోజుల పాటు రిమాండ్ లో ఉన్న అంబటి రాంబాబుకేసుకు సంబంధించి అంబటికి ఈరోజు సమన్లు జారీ చేసిన న్యాయస్థానం



## మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

### - ఎమ్మెల్యే గళ్ళా మాధవి....

బపెన్ పవర్, గుంటూరు, మార్చి, 03.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి కి వినిపించారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాల కేటాయింపులు, టిడ్కో ఇళ్ల పంపిణీ మరియు నిర్మాణ సమస్యలు, అలాగే తమ నివాస ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్రంగా వివరించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే కి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి సమస్యను విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత, గృహ సమస్యల పరిష్కారం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. మహిళల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యాల్లో ఒకటని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, పార్టీ కార్యాలయం ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.



# జిల్లెళ్ళమూడిలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 3:
బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ పూర్తయిన అనంతరం, అత్యాధునిక భద్రతా ప్రమాణాలు, రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఈరోజు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ : రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రతి రైతుకు తన భూమిపై పూర్తి హక్కులు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారిక ముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకాలు అత్యంత ప్రామాణికమైనవని, వీటి ద్వారా రైతులకు బ్యాంక్ రుణాలు మరియు ఇతర ప్రభుత్వ పథకాలు పొందడం సులభతరమవుతుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి రైతుకు సకాలంలో సేవలందించాలని అధికారులను ఆదేశించారు. గతంలో భూ రికార్డుల విషయంలో రైతులు పడ్డ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రీ-సర్వేను పూర్తి చేసిందని ఆయన తెలిపారు. రాజముద్రతో కూడిన ఈ పాస్ పుస్తకాలు రైతులకు పూర్తిస్థాయి



భద్రతను ఇస్తాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జరిగిన ఈ సర్వే వల్ల సరిహద్దు వివాదాలకు తావుండదని, రైతులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే తమ సంకల్పమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రెవెన్యూ యంత్రాంగం నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి, క్షేత్రస్థాయిలో ఉన్న చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. దశాబ్దాల కాలంగా తమ భూములకు సంబంధించి



ఎదురుచూస్తున్న స్పష్టత ఇప్పుడు లభించిందని జిల్లెళ్ళమూడి గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి స్వయంగా వచ్చి పాస్ పుస్తకాలు అందజేసిన ఎమ్మెల్యే కి వారు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ గ్లోరియా , తాసిల్దార్ షాలిమా, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గండికోట పోతురాజు, ప్రధాన కార్యదర్శి ఖగ్గా నాగరాజు, స్థానిక రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అమెరికా-ఇజ్రాయిల్ తో భారత్ సంప్రదింపులు జరపాలి... -సిపిఐ..

పెన్ పవర్,గుంటూరు: మార్చి, 03. ప్రస్తుతం ప్రపంచంలో భయానక పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారతదేశం తటస్థ వైఖరి కాకుండా ఆ పరిస్థితులు అదుపు చేసేందుకు జరిగే కృషికి నాయకత్వం వహించాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ కె. నారాయణ ప్రధాని మోదీకి సూచించారు. ఇరాన్లో పాలన మార్పు అంటూ చేపట్టిన సైనిక దాడులను, దురాక్రమణను నిలువరించేందుకు తక్షణమే అమెరికా-ఇజ్రాయిల్ తో భారత్ సంప్రదింపులు జరపాలన్నారు. దేశ ప్రజలు ఎన్నుకున్న నాయకత్వాన్ని దించాలని చూడటం అత్యంత దుర్మార్గపు చర్య అని, ప్రపంచ ప్రజాస్వామ్యం బలిపశువు అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం స్వార్ధ ప్రయోజనాల కోసం ఇరాన్పై దాడులు సమర్ధనీయం కాదన్నారు. కుటుంబాలను కూడా లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడటం శోచనీయమని అన్నారు. ఈ చర్యల కారణంగా కొన్ని దేశాలు ఇరాన్కు మద్దతుగా... మరికొన్ని దేశాలు అమెరికాకు మద్దతుగా చీలి మూడవ ప్రపంచ యుద్ధంగా మారునుందా అనే భయాందోళన నెలకొందని అన్నారు. తక్షణమే మోదీ... ట్రంప్ మాట్లాడి ఈ చర్యలను నిలుపుదల చేయించాలన్నారు. ఎవరు ఆరంభించారో వారే యుద్ధానికి ముగింపు పలకాలని హితవుపలికారు. లేకుంటే ప్రతీకార దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్-అమెరికా-ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రెటోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని, ఈ ప్రభావం నిత్యావసర సరుకులపై కూడా పడుతుందని నారాయణ చెప్పారు. బ్రిటన్ తో పాటు పలు దేశాలు ఈ దాడులలో పాల్గొనబోమని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అకస్మాత్తుగా జరిగిన పరిణామాలతో లక్షలాది మంది భారత సంతతి గల్ఫ్ దేశాలలో ఇరుక్కుపోయారని, వారిని స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

**పావర్టీ ప్రీడమ్ ఇండియాగా ప్రకటించండి:**

సక్సును అంతమొందించవచ్చు కానీ నక్సలిజానికి అంతం ఉండదని నారాయణ అన్నారు. నక్సలిజానికి ఒక ఫిలాసఫీ ఉందని, దానిని సమాధి చేసిన మరలా విప్లవం మొలుస్తుందని స్పష్టం చేశారు. సమస్య ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుందని చెప్పారు. నయా హిట్లర్ అమిత్ షా భారతదేశాన్ని 'నక్సల్ ఫ్రీ ఇండియా'గా చేస్తామని చెబుతున్నారని, 'పావర్టీ ఫ్రీ ఇండియా' చేస్తే నక్సలిజం ఉండదనే విషయాన్ని ఆయన తెలుసుకోవాలని నారాయణ అన్నారు. ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు ఆపరేషన్ కగర్ చేపట్టారని విమర్శించారు. కేంద్ర పెద్దలు సంబరపడాల్సిన అవసరం లేదని, శ్రీలంక, బంగ్లాదేశలలో ప్రజలే తిరుగుబాటు. చేశారని, అలాంటి పరిస్థితి భారతదేశంలో రాకుండా ఉండాలంటే ప్రావర్టీ ఫ్రీ ఇండియా చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.

**ధార్మక సంస్థల్లో ఆ సంస్కృతి మారాలి:**

ధార్మిక సంస్థల్లో కాంట్రాక్టర్లు, కార్పొరేట్లు, అవినీతి రాజకీయ నాయకులను నియమించే సంస్కృతి మారాల్సిన అవసరం ఉందని నారాయణ అన్నారు. వీరిని చైర్మన్లుగా నియమించడం వలన దేవుడి పేరుతో వ్యాపారం చేసే అవకాశాలు ఉంటాయని. ఆరోపించారు. వీరు చేసే క్రియలతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని చెప్పారు.

**ఐఏఎస్, ఐపీఎస్ లు లక్ష్మణరేఖ దాటవద్దు:**

ఐఏఎస్, ఐపీఎస్ వ్యవస్థలు సమాజంలో చాలా గౌరప్రదమైన వ్యవస్థలని, ఈ హోదాల్లో విధులు నిర్వర్తించే అధికారులు చట్టం గీసిన లక్ష్మణరేఖ దాటకుండా నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని నారాయణ కోరారు. కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ ప్రవర్తన వ్యవస్థలను అవమానపరిచేలా ఉండటం శోచనీయమని అన్నారు. రాజకీయ నాయకులు కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటారని, కానీ మీరు సుదీర్ఘకాలం ప్రజా సేవలో ఉంటూ వ్యవస్థలను గాడిన పెట్టే బాధ్యతలను కలిగి ఉంటారని చెప్పారు. ఆ బాధ్యతలను విస్మరిస్తే అభాసుపాలౌతారని అన్నారు. ఇందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి ఘటనను ఉ దహరించారు.

**నిద్రావస్థలో వ్యవస్థలు:**

కాదేదీ అవినీతికి అనర్హం అన్నట్లు ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు ఉన్నాయని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాకినాడలో జరిగిన పేలుడు ఘటన, రాజమండ్రిలో చోటుచేసుకున్న పాల కల్తీ వ్యవహారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ చట్టాలు ఏమయ్యాయని, అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. నిఘా కొరవడిందని, ఆరోగ్య వ్యవస్థ పడకేసిందన్నారు. ఘటనలు జరిగిన ప్రాంతాలలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పర్యటించి బాధితులను పరామర్శించారని గుర్తుచేశారు. కేవలం ఎక్స్ గ్రేషియా ఇస్తే సరిపోతుందా అంటూ నారాయణ నిలదీశారు. వ్యవస్థలు సరిగా పనిచేసి ఉంటే ఇటువంటి ఘటనలు జరిగి ఉండేవి కాదని అన్నారు.



**మధ్యవర్తిత్వంతో అగ్రి బాధితులకు న్యాయం:**

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి మధ్యవర్తిత్వం సులువైన మార్గమని సాక్షాత్తు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ దిశగా సత్వరమే చర్యలు చేపట్టాలని నారాయణ డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ సంస్థకు రూ.20 వేల కోట్లు ఆస్తులు ఉన్నాయని, ఆయా ఆస్తులను అటాచ్మెంట్ చేసి రూ.2 వేల కోట్లు కేటాయించి 32 లక్షల కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ ఎప్పటినుంచో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. ఆమరణ దీక్షలకు కూడా వారు సిద్ధమయ్యారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారికి న్యాయం చేసి చిత్తశుద్దిని నిరూపించుకోవాలని సూచించారుు

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి


**- బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు**

**- 27 మంది లబ్ధిదారులకు రూ. 15,69,538/- విలువైన CMRF చెక్కుల పంపిణీ**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 3:
ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ఒక వరమని, బాధితులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం అండగా నిలుస్తుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 27 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన రూ. 15,69,538/- విలువ గల చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి లబ్ధిదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని మరియు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:-**

"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆసుపత్రి ఖర్చుల భారంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను







ఆదుకోవడమే లక్ష్యంగా ఈ నిధులు మంజూరు చేయడం జరుగుతోంది. బాపట్ల నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదన్నదే మా సంకల్పం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తాం అని అన్నారు. ముఖ్యమంత్రి నిరంతరం ప్రజల కష్టాలను ఆలకించి, తక్షణమే స్పందిస్తున్నారని, అందుకు ఈ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులే నిదర్శనమని పేర్కొన్నారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానూ, ప్రభుత్వం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సీయం సహాయ నిధి చెక్కులు అందుకున్న 27 మంది లబ్ధిదారుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మద్దాల మునలయ్య కర్లపాలెం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతిరావు కార్యకర్తలు తదితరులు.



# అనారోగ్యంతో ఉన్న విద్యార్థినికి ఆర్థిక సహాయం:

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 3:
బాపట్ల :అనారోగ్యంతో ఉన్న విద్యార్థిని కి మెరుగైన వైద్యం చేయించుకొవడం కోసం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని ఆర్గనైజేషన్ కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ అన్నారు.బాపట్ల పట్టణంలోని స్థానం వారి వీధిలో ఉంటున్న టి. శ్రీనివాసరావు కుమార్తె సూర్యలంక రహదారిలోని సరస్వతి మెమోరియల్ జూనియర్ ఇంటర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతూ అనారోగ్యంతో ఉండడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడుతూ చదువులు తల్లిగా మంచిగా చదువుకుంటూ అనారోగ్య పాలై అయిందని, వైద్యం చేయిస్తున్నప్పటికీ తగ్గకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతూ పరీక్షలు రాస్తుందని అనారోగ్యంతో ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాలకు పరీక్ష రాస్తుందన్నారు. విద్యార్థి తండ్రి వైద్య ఖర్చులకోసం ఆర్గనైజేషన్ ద్వారా సహాయం చేయాలని కోరడంతో సభ్యుల సహకారంతో విద్యార్థినీకి తమ వంతు సహాయాన్ని అందించామని చెప్పారు. మరికొందరు దాతలు ముందుకు వచ్చి విద్యార్థినికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు శ్రీనివాసరావు, అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి,కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు భీమా కోటేశ్వరరావు, బుర్ల సురేష్, ఓటికుండల లక్ష్మణరావు, విన్నకోట శ్రీనివాసరావు, బండ్రెడ్డి అంకమ్మ రావు, పెద్దమల్లు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 3:
మాదకద్రవ్యాల వలన కలిగే అనర్ధాల గురించి రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆటోలలో అతికించిన జిల్లా పోలీసులుఅవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చీరాల డిఎస్పి ఎండి.మోయిన్ మాదకద్రవ్యాల మహమ్మారిని జిల్లా నుండి పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం చీరాల పట్టణంలోని స్థానిక సెయింట్ మార్క్స్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో చీరాల డిఎస్పి ఎండి.మోయిన్ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆటో డ్రైవర్లకు డ్రగ్స్ వలన కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించి, సమాజంలో చైతన్యం నింపేలా రూపొందించిన ప్రత్యేక పోస్టర్స్ ఆటోలకు అతికించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ సాధారణంగా పాఠశాలలు, కళాశాలలు, జనసమ్మర్ధం గల ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామన్నారు. అయితే, సామాన్య ప్రజలలో సైతం ఈ అంశంపై పూర్తి అవగాహన పెంపొందించేందుకు ఈసారి ఆటోలను ప్రచార వాహనాలుగా ఎంచుకున్నామన్నారు. ఆటోలలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు కాబట్టి, ఆటో లోపల, బయట అతికించిన పోస్టర్ల ద్వారా ప్రయాణికులకు డ్రగ్స్ వల్ల



కలిగే అనర్ధాల గురించి సమాచారం సులభంగా చేరువవుతుందన్నారు. ఈ వినూత్న మార్గం ద్వారా ప్రతి ఒక్కరూ డ్రగ్స్ లేని సమాజం కోసం ఆలోచిస్తారనే సదుద్దేశంతో ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఆటో డ్రైవర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ పట్టణంలోని మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్తుంటారు కాబట్టి వారు సమాజ రక్షణలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి సేవించినా లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ లు 1972, 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాపట్ల జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని, వీటికి ప్రజల నుండి కూడా పూర్తి సహకారం లభిస్తే ఆశించిన లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పి ఎండి.మోయిన్, చీరాల 1టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్.సుబ్బారావు, స్టేషన్ ఎస్.ఐ లు, సిబ్బంది, ఈగల్ టీమ్, పట్టణంలోని ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సు ప్రయాణం

**: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 03: ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ఏడు వారాల ప్రత్యేక చర్యలు చేపట్టిన విషయం గుర్తుచేశారు. అందులో భాగంగా విభిన్న ప్రతిభావంతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం జి.ఓ. విడుదల చేసింది. ఈ నిర్ణయానికి కృతజ్ఞతగా మంగళవారం పల్నాడు జిల్లా విభిన్న ప్రతిభావంతుల తరఫున, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉపశమనం కలిగిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు వేముల బాలరాజు, అధికార ప్రతినిధులు షేక్ అల్లా నబి, సయ్యద్ సుభాని, తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కోశాధికారి కొల్లి శెట్టి వెంకటేశ్వరరావు, నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు ఏనుగంటి వెంకట కృష్ణారావు, మల్లెల కోటేశ్వరరావు, కానాల గంగయ్య, ఎలమా సాంబశివరావు, రమణయ్య, రామకృష్ణ, వేణుగోపాల చారి తదితరులు పాల్గొన్నారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని నాయకులు కోరారు.




# కరుణపురంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సర్వసభ్య సమావేశం

పెన్ పవర్ ఉమ్మడి వరంగల్ జిల్లా
కరుణపురం గ్రామంలో మార్చి 2న భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్మిక రత్న మరియు శ్రమ శక్తి అవార్డు గ్రహీత గిన్నారపు మహేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిన్నారపు మహేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరి కార్మిక సంక్షేమానికి విరుద్ధంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు కార్మిక నియమావళుల విడుదలతో కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పలు సంఘాలు ధర్నాలు, భారత్ బంద్కు పిలుపునిచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు 1930 కాలం నుండి కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా ఎన్నో చట్టాలు అమలులోకి వచ్చాయని, అనేక మంది కార్మికులు రక్తం చిందించి త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాలను ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా నిర్వీర్యం చేయలేదని, అయితే ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం కార్మిక లోకానికి అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా అన్ని సంఘాలు సంఘటితమై పోరాటం చేయాలని, గ్రామ గ్రామాన సంఘాలను బలోపేతం చేసి కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బైరపాక సుధాకర్, స్థానిక నాయకులు కరుణపురం గ్రామ శాఖ అధ్యక్షుడు జిల్లెల జాన్, మైదం ఉపేందర్, కుతటి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో ఆసరాగా ప్రభుత్వం

**-అత్యవసర వైద్యానికి ఎమ్మెల్యే ఏలూరి వెన్నుదన్ను-అత్యవసర వైద్య చికిత్సలకు తక్షణ స్పందన**

**-3కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం-ఎల్ఓసి ద్వారా రూ.9.89 లక్షలు మంజూరు**

పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 3:
ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం తలుపుతట్టిన మూడు కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచారు... ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు. బాధితుల ఆవేదనను వ్యక్తిగతంగా స్వీకరించి, ప్రభుత్వంతో సమన్వయం చేసి ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా ఎల్ఓసి మంజూరు అయ్యేలా తక్షణ చర్యలు చేపట్టారు. క్యాన్సర్, గుండె సంబంధిత మరియు బేబీ అత్యవసర వైద్య అవసరాల కోసం మొత్తం రూ.9.89 లక్షల ఆర్థిక సహాయం అందడంతో చికిత్సకు మార్గం సుగమమై, ఆందోళనలో ఉన్న కుటుంబాలకు ఒక భరోసాగా ధైర్యం కల్పించారు ఎమ్మెల్యే ఏలూరి. ప్రజల ఆపదను తన బాధ్యతగా భావించిన ప్రజాప్రతినిధి స్పందన, ప్రభుత్వంప్రజాప్రతినిధి సమన్వయం కలిసి ప్రాణాలకు మూడు కుటుంబాలకు ఎమ్మెల్యే సాంబన్న ఆసరాగా, వెన్నుదన్నుగా నిలిచారు.మార్టూరు, కారంచేడు మండలాల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మానవీయంగా స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) కింద మొత్తం రూ.9,89,847ల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.

**క్యాన్సర్ బాధితురాలికి రూ.6 లక్షల మంజూరు...**
కారంచేడు మండలం కారంచేడు గ్రామానికి చెందిన పోతిని విజయలక్ష్మి క్యాన్సర్ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమైన పరిస్థితి ఏర్పడింది. కుటుంబ ఆర్థిక స్థితి బలహీనంగా ఉండటంతో స్థానిక నాయకులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి వెంటనే స్పందించి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఎల్ఓసి కింద రూ.6 లక్షల చెక్కును మంజూరు చేయించారు. దీంతో కుటుంబానికి గణనీయమైన ఊరట లభించింది.

**గుండె చికిత్సకు రూ.2 లక్షలు...**
మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన సోమల ఆంజనేయులు గుండె సంబంధిత అత్యవసర చికిత్స కోసం సహాయం కోరగా, ఎమ్మెల్యే సిఫారసుతో రూ.2 లక్షల ఎల్ఓసి మంజూరు అయ్యింది. అవసరమైన వైద్యం అందుకునేందుకు ఈ సహాయం దోహదపడింది.

**చిన్నారికి వైద్య సహాయం రూ.1.89 లక్షలు...**
మార్టూరు మండలం ద్వారకపాడు గ్రామానికి చెందిన పాలపర్తి శారద కుమార్తెకు అత్యవసర వైద్య చికిత్స అవసరమవడంతో, ఎమ్మెల్యే ఏలూరి సిఫారసుతో రూ.1,89,847ల ఎల్ఓసి చెక్కు మంజూరు చేయించారు.



**మానవీయ దృక్పథంతో సేవలు...**
ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆపద సమయంలో అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా మరింత సహాయం అందేలా కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అత్యవసర సమయంలో అందిన ఈ ఆర్థిక సహాయం కుటుంబాలకు ఆశాకిరణంగా మారింది. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కామేపల్లి హరిబాబు, మిన్నకంటి రవి, పెంట్యాల శరత్, పర్వతాలు, శ్రీరామ్ మూర్తి, రామకృష్ణ ,క్యాంపు కార్యాలయ ప్రతినిధులు చెక్కులను అందజేశారు



# ప్రజల ముంగిటకే పాలన, సమస్యల పరిష్కారమే ధ్యేయం

**ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 03: నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం తన కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా దర్బార్ లో పాల్గొని, నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు మరియు మౌలిక వసతులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆరోగ్య శాఖాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించడమే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఏ ఒక్కరూ సమస్యలతో ఇబ్బంది పడకూడదన్నదే నా సంకల్పం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# నిమ్జ్‌లో మౌలిక వసతుల అభివృద్ధి జిల్లా కలెక్టర్ సమీక్ష

పెన్ పవర్ సంగారెడ్డి ,మార్చి 02 )
జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ,అధికారులను ఆదేశించారు . సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నిమ్జ్ మొదటి దశ లో స్వాధీనం చేసుకున్న భూముల సరిహద్దుల గుర్తింపు, పెంచింగ్ పనులు, సమీప రహదారుల అభివృద్ధి, నిమ్స్‌కు అనుసంధానించే ముఖ్య మార్గాల విస్తరణ వంటి అంశాలపై నిమ్జ్ ,టి జి ఐ ఐ సి అధికారులు , సర్వే, రెవిన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ... నిమ్జ్ లో మౌలిక వసతులు కల్పించే ఎస్ఆర్అర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి ఇప్పటి వరకు సేకరించిన భూములను అప్పగించాలని కలెక్టర్ సూచించారు. లే అవుట్ అభివృద్ధి చేసేందుకు వీలుగా పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. లే అవుట్ ప్రకారం రోడ్లు, ఇతరత్ర మౌలిక వసతులు కల్పించేందుకు సేకరించిన భూముల్లో హద్దురాళ్ళను ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.గతంలోనే భూములు తీసుకుని రైతులకు నష్ట పరిహారం చెల్లించామని కానీ మొన్నటివరకు ఆ భూముల్లో పనులు చేపట్టకపోవడంతో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఇచ్చామని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టనుండటం తో ఇకపై పంటలు వేయకుండా చూడాలని, ఐదివరకే పంటలు వేసి ఉంటే కోతలు పూర్తయ్యే వరకు వేచి చూడాలన్నారు. సర్వే ఎలాంటి ఆటంకాలు లేకుండా శాంతియుత వాతావరణం లో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సర్వే సందర్భంగా వేసిన హద్దు రాళ్ళను రైతులేవరూ తొలగించవద్దని, అలా చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశం లో అడిషనల్ కలెక్టర్ లు మాధురి, పాండు లతో పాటు టీజిఐఐసి జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి ,తాహిల్దార్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ వాటర్ లైన్మెన్ కార్మికునికి ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

పెన్ పవర్ జహీరాబాద్
చిన్న హైదరాబాద్ లో అవుట్ సోర్సింగ్ వాటర్ లైన్మెన్ గా పనిచేస్తున్న పుర నరేష్ కుమార్ కు ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయము ముందు ధర్నా నిర్వహించి అనంతరం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. చిన్న హైదరాబాద్ వార్డ్ నెంబర్ 9 కి నరేష్ చిన్న హైదరాబాద్ లొ వాటర్ లైన్మెన్ గా పని చేస్తున్నాడు అదే వార్డు కు చెందిన దారా. రాజు అనే వ్యక్తి ఫోన్ చేసి ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ నీవు ఊర్లోకి వస్తే నిన్ను కొడతాను కాలు విరగోడతా అంటూ మాట్లాడిన రాజు పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తోటి వర్కర్స్ మరియు యూనియన్ నాయకులు నర్సిములు మాట్లాడుతూ లైన్మెన్ కు ఇష్టం వచ్చినట్లు మనుస్సు కు గాయం కలిగినట్లు మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# 12 వ వార్డు కౌన్సిలర్ పులి మామిడి మమత రాజు దంపతులను ఘనంగా సన్మానించిన ఉషాకిరణ్ యూత్ సభ్యులు

పెన్ పవర్ సదాశివ పేట
సదాశివపేట పట్టణంలోని పి.ఎం. ఆర్ క్యాంపు కార్యాలయంలో సాధారణ మున్సిపల్ ఎన్నికలలో 12 వ వార్డునుండి గెలిచినటు వంటి పులిమామిడి మమత రాజు దంపతులను ఉషాకిరణ్ యూత్ సభ్యులు శాలువాలతో మరియు పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఇట్టి సందర్భంగా బామిని రవి కుమార్ మాట్లాడుతూ మా చిన్నానాటి మిత్రుడు పులిమామిడి రాజు రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత ఎత్తుకు యెదగాలని వారు ఇట్టి సందర్భంగా గుర్తు జేశారు. ఇలాంటి మంచి మిత్రుడు మాకందరికి దొరకడం మా పూర్వజన్మ సుకృతమని బామిని రవి మరియు బుసరెడ్డి పల్లి వెంకటేశం అన్నారు. అదేవిధంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ ఇంత చక్కటి మిత్రులు నా వెన్నంటు ఉండి ముందుకు నడిపిస్తున్నందుకు ఉషాకిరణ్ యూత్ సభ్యులందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా సంగారెడ్డి నియోజక వర్గ ప్రజలందరికి మరియు మిత్రులందరికి మరియు శ్రేయోభిలాషులకు ముందుగా హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు, సభ్యులు, మరియు పి. ఎం. ఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ఘనంగా హోలీ వేడుకలు

**ప్రజలతో కలిసి రంగుల పండుగ జరుపుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి మార్చి 03: వసంత రుతువులకు స్వాగతం పలికే రంగుల పండుగ హోలీ వేడుకలు మంగళవారం నరసరావుపేట నియోజకవర్గంలో అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు నియోజకవర్గ ప్రజలతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ హోలీ పండుగ చెడుపై గెలిచిన మంచికి సంకేతమని పేర్కొన్నారు. ఇది సమత, మమతలకు చిహ్నమని, పేద-పెద్ద తారతమ్యాలు లేకుండా, కులమత భేదాలు చూడకుండా రంగుల్లో అంతా కలిసిపోయి ఆనందాలను పంచుకునే అద్భుతమైన పండుగని అయన కొనియాడారు. నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో ఈ రంగుల పండుగ సుఖశాంతులను, సరికొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ అందరికీ తన హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భారీ సంఖ్యలో ప్రజలు, అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొని ఒకరికొకరు రంగులు పూసుకుంటూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.



# క్రిస్టియన్‌ల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి..

**పోలీస్ స్టేషన్ ను ముట్టడించిన క్రైస్తవ యువకులు ప్రజాప్రతినిధులు...**



పెన్ పవర్ జహీరాబాద్
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఆనెగుంట గ్రామానికి చెందిన యువకుడు క్రిస్టియన్ ల పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా సోమవారం జహీరాబాద్ నియోజకవర్గం క్రైస్తవ సమాజం అగ్రహారంతో పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు దీంతో డిఎస్పి సైదా నాయక్ సీఐ శివలింగం ఎస్సై కాశీనాథ్ క్రైస్తవ సమాజానికి క్రిస్టియన్ల పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం అని మాట ఇచ్చి క్రైస్తవ సమాజం పెద్దల సంక్షమంలో తప్పుయిందని నింధితునితో చెప్పించడం జరిగింది మరియు చట్టపరమైన చర్యలు తీస్కుంటామని మాట ఇవ్వడంతో ఆందోళన విరమించుకొని స్థానిక ఐబి ముందు సమావేశంలో పలువురు నేతలు మాట్లాడినారు. క్రైస్తవులపై ఎవరైనా దాడి చేసిన మాట్లాడినకించపరిచిన మనం అందరం ముక్తకంఠముతో ఖండించాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమం లో పలువురు ప్రజా ప్రతినిధులు పాస్టర్ లు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చక్కగా చదువుకోవాలి

**-సర్పంచ్ కుమ్మరి రాజేశ్వరి గోపాల్**



పెన్ పవర్ ఝరాసంగం )
విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని గ్రామ సర్పంచ్ కుమ్మరి రాజేశ్వరి గోపాల్ అన్నారు. సోమవారం గినియార్పల్లి ప్రాథమిక పాఠశాల 5 వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశా నికి, గ్రామ సర్పంచ్ కుమ్మరి రాజేశ్వరి గోపాల్ పాల్గొని విద్యార్థులను అభినందనలు తెలియజేస్తూ..చక్కగా చదువు కోవాలని నిర్దేశించారు..కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి రాజు, ఉపసర్పంచ్ -యాసీన్ అలీ,గ్రామ నాయకులు -గోపాల్ గ్రామస్తులు, భాగప్ప, వెంకటేశం, బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

## -జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



పెన్ పవర్ సంగారెడ్డి, మార్చి ) గ్రామాల సర్వతో ముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతా యుతంగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు (నాలుగు మండలాలకు చెందిన 4వ బ్యాచ్) నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ,శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో గ్రహించి, శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి మంచి చేయాలన్న, గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా పరిష్కరించాలి, అందుబాటులో ఉన్న నిధులను ఎలా సక్రమంగా వినియోగించుకోవాలి వంటి అంశాలపై ఈ శిక్షణ ద్వారా స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యతని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించి, ప్రాధాన్యత ఆధారంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి 31 లోగా పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వేసవి కాలంలో నీటి సరఫరా సవ్యంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన మెటీరియల్‌తో కూడిన బ్యాగులను జిల్లా కలెక్టర్ సర్పంచులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు



# రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలి

పెన్ పవర్ నారాయణ ఖేడ్

ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే పిఏకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్ ఎస్ఎఫ్ఐ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి స్వరాజ్ లు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగానికి కావాల్సిన నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి అన్నారు.కొఠారి కమిషన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలి కానీ గతంలో అరకొర నిధులు మాత్రమే కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్ సమావేశాలలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు సంబంధించిన స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ 8వేల కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయి కాబట్టి వాటిని విడుదల చేయాలి.విద్యార్థులు తమ సమస్యలు చెప్పుకోవడానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం దారుణమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖ మంత్రినీ నియమించే విధంగా చర్చలు జరపాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాల పెంపు కోసం పోరాడుతున్న అంగన్వాడి నాయకురాలు అరెస్టు సిగ్గుచేటు

## నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు సిఐటియు




ఎమ్మిగనూరు మార్చి 3 పెన్ పవర్

వేతనాల పెంపు కోసం పోరాడుతున్న అంగన్వాడీ నాయకురాలనుఅరెస్టు చేసిన రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ ను, అంగన్వాడీ నాయకురాళ్లను వెంటనే విడుదల చేయాలి సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా కమిటీ ప్రాజెక్ట్ కార్యదర్శి బి. గోవర్ధనమ్మ, నాయకులు నీరజ, మల్లేశ్వరి, నాగ శిరోమణి డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో అంగన్వాడీ కార్యకర్తల అక్రమ అరెస్టులను నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం.విజయవాడలో శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తున్న అంగన్వాడి నాయకులను కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ, ఎమ్మిగనూరులో నిరసన ర్యాలీ, సభ మంగళవారం నాడు నిర్వహించారు. ఎండిఓ ఆఫీస్ దగ్గర నుండి సోమప్ప సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, మెయిన్ బజార్లో ర్యాలీ నిర్వహించారు. అరెస్టు చేసిన అంగన్వాడి నాయకులను వెంటనే విడుదల చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచాలని అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా చేయాలని నినాదాలు చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని గ్రాట్యుటీ అమలుచేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మార్చి రెండున చలో విజయవాడ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది అంగన్వాడీ వర్కర్ల ధర్నాను నిర్విఘ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యబద్ధంగా రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. అర్ధరాత్రి నిరాహార దీక్షలో నిద్రిస్తున్న వారిని పోలీసులు దౌర్జన్యంగా వాహనాలెక్కించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గత చాలా కాలం నుండి వేతనాల పెంపు పైన అనేక సంప్రదింపులు, రాయబారాలు, చర్చలు రూపంలో ప్రభుత్వానికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం నిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించడాన్ని విమర్శించారు.సంబంధిత మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్ని సమస్యలు పరిష్కరించామని ఒక వేతనం తప్ప ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటా అన్నదాన్ని సిగ్గుచేటైన విషయంగా భావించారు. ప్రధానమైనటువంటి డిమాండు వేతనాల పెంపుదలే అనే విషయం ప్రభుత్వానికి తెలిసిన ఆ సమస్యనుపరిష్కరించకుండా మిగతా డిమాండ్లను అరాకొరగా పరిష్కరిస్తే ఏం లాభం అంగన్వాడీలకు ఉంటుందని ఎద్దేవా చేశారు. తక్షణమే న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ, బేబీ రాణి ని తదితర నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతనాల సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రభుత్వంతో పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకురాలు సుమిత్రమ్మ, భాగ్యలక్ష్మి, ప్రమీల, మహేశ్వరి, చిట్టెమ్మ, పూర్ణ, దుర్గ, మేరీ, రామేశ్వరి, వరలక్ష్మి, మహేశ్వరి, యు ఎమ్ నాగలక్ష్మి, బండాలత, నిర్మల, మున్ని, లతా రాణి, సుజాత, విజయలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సి గోవిందు, బి రాముడు సిఐటియు నాయకులు రమేష్, శీను, హుస్సేన్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# బ్యూటిషన్ రంగంలో పోతిరెడ్డిపల్లి గ్రామ మహిళకు నంది అవార్డు

హైదరాబాద్,మార్చ్ 03 పెన్ పవర్



హైదరాబాదు లక్డీకపూల్ బిర్లా మందిర్ లోని భాస్కరాచార్య ఆడిటోరియంలో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు సోమవారం మెగా ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సినీ నటుడు బాబు మోహన్ విచ్చేయగా కార్యక్రమంలో నృత్య, సామాజిక సేవకులకు,సింగర్ కు, అలంకరణల వారికి అలాగే మరికొన్ని రంగాలలో రాష్ట్ర స్థాయి నంది అవార్డులను గ్రహీతలకు అందజేశారు.అందులో భాగంగా అలంకరణ(బ్యూటిషన్) రంగంలో సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కత్తుల నర్మదా భాస్కర్ రెడ్డి నంది అవార్డుకు ఎంపికవగా సోమవారం సినీ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా కత్తుల నర్మద మాట్లాడుతూ ఏ రంగంలో అయినా పట్టుదలతో,సమయస్ఫూర్తితో,కష్టపడి పని చేస్తేనే గుర్తింపు వస్తుందని,గత ఐదు సంవత్సరాలుగా కష్టపడి నేర్చుకొని పని చేస్తున్నానని అన్నారు.అందుకే మనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఇష్టపడి,కష్టపడి పని చేస్తే ఏ రంగంలో అయినా ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించవచ్చని అన్నారు.

# విద్యార్థినులకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే

పెన్ పవర్ నాగల్ గిద్ధ




నాగల్ గిద్ధ మండల పరిధిలోని కరస్గుత్తి గ్రామంలోని గిరిజన బాలికల కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి నారాయణఖేడ్ కు ఆటో లో వెళు తున్నారు.ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి నారాయణఖేడ్ కు ఆటో లో కిక్కిరిసి వెళుతున్నారు భద్రత ఉండదని బావించి అధికారులు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళారు వెను వెంటనే ఎమ్మెల్యే ఆర్.టి.సి అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు.విద్యార్థినిలు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి బస్సు సౌకర్యం కల్పినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మేము సమయానికి పరీక్ష కేంద్రానికి వెళుతున్నామని తెలిపారు.

# బాధితురాలు ముక్కరమ్మకు వైయస్సార్సీపి పార్టీ నేతలు అండ

ఎమ్మిగనూరు మార్చి 3 పెన్ పవర్

ఎమ్మిగనూరు పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థల కేటాయింపు, పట్టా హక్కు మరియు కబ్జా ఆరోపణలకు సంబంధించిన అంశంపై బాధితురాలు ముక్కరమ్మ కి పూర్తి న్యాయం జరిగే వరకు మేము న్యాయబద్ధమైన పోరాటం కొనసాగిస్తామని డి. నజీర్ అహ్మద్, కామర్తి నాగేశప్ప, ఎన్.ఎండి. షరీఫ్ సంయుక్తంగా తెలిపారు. మాపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసులు నమోదు చేయించే ప్రయత్నాలుజరుగుతున్నాయని తెలిసిన నేపథ్యంలో, మేము ఎటువంటి భూమి కబ్జాలకు పాల్పడలేదని, ఎటువంటి అక్రమ కార్యకలాపాలకు సంబంధించలేదని స్పష్టంగా తెలియజేస్తున్నాము. చట్టపరమైన ఏ విచారణకైనా హాజరై పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నాము.బి

బాధితురాలు ముక్కరమ్మ ఈ ఊరికి చెందిన కోడలిగా, ప్రభుత్వం తనకు రెండు సెంట్ల స్థలాన్ని చట్టబద్ధంగాకేటాయించిందని పేర్కొన్నారు. ఆమె ప్రస్తుతం హుస్సేన్ అప్ప కొట్టాలలో నివసిస్తూ, ఆ ప్రభుత్వ స్థలంలో పూరి గుడిసె నిర్మించుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. సుమారు మూడు నెలల అనంతరం జ్యోతి అనే మహిళ, ఆమె భర్త శాంతిరాజు, ఆమె తమ్ముడు మరియు వారికి అండగా ఉన్న కదిరి కోట సునీల్ కుమార్, కదిరి కోట వినోద్ కలిసి తన గుడిసెను మరియు ప్రక్కనున్న స్థలాన్ని దౌర్జన్యంగా కబ్జా చేసి గుడిసెకు తాళం వేశారని ఆమె ఆరోపించారు. తాను అక్కడికి వెళ్లిన సమయంలో జ్యోతి తమ్ముడు తనపై భౌతిక దాడి చేసినట్లు కూడా వెల్లడించారు.ఈ ఘటనపై గతంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సంబంధిత పోలీస్ అధికారి ఎమ్మిగనూరు తహసిల్దార్ ని సంప్రదించి నిజమైన పట్టాదారు ఎవరనే అంశంపై నివేదిక ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం నుండి రాతపూర్వక ఎండార్స్మెంట్ ద్వారా ఆ స్థలం ముక్కరమ్మ కే కేటాయించబడిందని, ఆమెకే చట్టబద్ధ హక్కు ఉందని ధృవీకరించి పోలీస్ అధికారికి పంపినట్లు ఆమె పేర్కొన్నారు. అధికారిక ధృవీకరణ ఉన్నప్పటికీ వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ మాపై ఆరోపణలు చేయడం అన్యాయమని మేము పేర్కొంటున్నాము.బి

ముక్కరమ్మ న్యాయం కోసం బుట్టా రేణుకమ్మ గారి భర్త బుట్టా శివ నీలకంఠ ని విన్నవించగా, ఆయన సూచనల మేరకు నజీర్ అహ్మద్ కామర్తి నాగేశప్ప ఆమెతో కలిసి తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ని కలిసి ఆమె తరఫున న్యాయం చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంశాన్ని పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.బి

బాధితురాలి పక్షాన నిలబడి న్యాయం కోరడం ప్రజాస్వామ్యబద్ధమైన హక్కు మాత్రమే కాని, ఎటువంటి కబ్జా చర్యలకు పాల్పడినట్లు చూపించడం పూర్తిగా అసత్యమని మేము స్పష్టం చేస్తున్నాము. మా పేర్లను ఉద్దేశపూర్వకంగా ప్రస్తావిస్తూ జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేయడం జరిగిందని, ఆ ఆధారంగా పత్రికలో ప్రచురితమైన వార్తను కొందరు సామాజిక మాధ్యమాల్లో వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ విధమైన ప్రచారం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వ హక్కు, ఆర్టికల్ 21 ప్రకారం జీవన హక్కు ప్రతి పౌరుడికి హామీ ఇవ్వబడ్డాయి. చట్టబద్ధంగా కేటాయించబడిన స్థలంపై హక్కు రక్షించుకోవడం ప్రతి పౌరుడి న్యాయబద్ధ హక్కు. ప్రభుత్వ అధికారులు ఇచ్చిన రాతపూర్వక ధృవీకరణను గౌరవించడం పరిపాలనా వ్యవస్థ బాధ్యత. ఈ అంశంలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, నిరపరాధులపై తప్పుడు ఆరోపణలు మోపకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాము. ఎమ్మిగనూరు తహసిల్దార్ కార్యాలయం ముందు బాధితురాలు ముక్కరమ్మ తో కలిసి శాంతియుతంగా ధర్నా నిర్వహించి, ఇప్పటికే సమర్పించిన అర్జీ పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకుని, తక్షణ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయనున్నాము. ఈ కార్యక్రమం పూర్తిగా చట్టబద్ధమైన,శాంతియుతమైన ప్రజాస్వామ్య విధానంలో నిర్వహించబడుతుంది.బి

అలాగే వచ్చే సోమవారం జిల్లా ఎస్పీ ని మరియు జిల్లా కలెక్టర్ ని మరల కలిసి, మాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పూర్తి ఆధారాలతో ఫిర్యాదు సమర్పించనున్నాము. అవసరమైతే సంబంధిత న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపోరాటం కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నాము.న్యాయం కోసం నిలబడటం మా బాధ్యతగా భావిస్తున్నాము. వాస్తవాలు, పత్రాలు, చట్టపరమైన ఆధారాలపై మా పోరాటం కొనసాగుతుంది. చట్టం ముందు నిజం గెలుస్తుందనే నమ్మకంతో ముందుకు సాగుతున్నాము.ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.బాధితురాలు ముక్కరమ్మన్యూ ఎస్స కాలనీ హుస్సేనప్ప కొట్టాలు, ఎమ్మిగనూరు పట్టణం

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

పెన్ పవర్ రాయికోడ్ 02మార్చి)




రాయికోడ్ మండలం పరిధిలోని హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నాడు పదవ తరగతి విద్యార్థులకు వార్షికపరీక్షల దృష్ట్యా రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తన సొంత నిధులతో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ప్రముఖులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంత్తయ్య చేతులమీదుగా విద్యార్థులకు పరీక్షప్యాడ్ లను అందజేశారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ,విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.పరీక్షలు జీవితంలో ఒక ముఖ్యమైన దశ అని, ధైర్యంగా మరియు ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ,మంచి మార్కులు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు పవన్ కుమార్, తరాసింగ్,ప్రసన్న,కవితకుమారి, ప్రశాంత్,రమేష్ మరియు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు

# గ్రామపంచాయితీలకు ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఆదాయాలు

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:**
గ్రామ పంచాయితీల ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ , బీపీఎస్ పథకాల ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయితీలకు వాటా ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు 50 శాతం,, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం, ఏపీ టౌన్ ప్లానింగ్ విభాగానికి 20 శాతం నిధులు చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. ఈ కొత్త విధానంతో గ్రామ పంచాయితీలకు నిధుల కొరత తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలకు మంచి రోజులు రానున్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయితీలతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విధానం కింద గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఎల్ఆర్ఎస్, బీపీఎస్ పథకాల కింద సమీకరించిన ఆదాయంలో సగం వాటాను పొందుతాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం ఆదాయాన్ని కేటాయిస్తారు. మిగిలిన 20 శాతం రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగానికి వెళ్తుంది. చాలా వరకూ గ్రామ పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఈ విధానం ప్రకారం వాటికి కావాల్సిన నిధులు అందజేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.స్థానిక సంస్థల సాధికారత విషయంలో ఏపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని ఈ నిర్ణయం తెలియజేస్తోందని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ విధానం ప్రకారం క్రమబద్ధీకరణ పథకాల ద్వారా సమీకరించిన నిధులను తిరిగి అదే ప్రాంత అభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీలకు సగం ఆదాయం కేటాయించడం ద్వారా, ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలైన పనులకు కూడా నిధులు లేక పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. అనేక గ్రామ పంచాయతీలు సాధారణ పారిశుద్ధ్య పనులను కూడా చేపట్టలేకపోతున్నాయి. ఎక్కువగా ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లపై ఆధారపడతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాూ, దీూ ఆదాయాలు స్థిరంగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. గ్రామ పంచాయతీలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. రెగ్యులరైజేషన్ పథకాల ద్వారా సేకరించిన నిధులను స్థానికంగానే ఖర్చు చేయనున్న నేపథ్యంలో ఎక్కువ మంది తమ ఆస్తుల రెగ్యులరైజేషన్ కోసం ముందుకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బెజవాడలో కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:** విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. ఈ మేరకు కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అయింది. హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారిలో విజయవాడ నగర పరిధిలో ఉన్నంత మేరకు.. ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే ప్రతిపాదనను సర్కార్ పరిశీలిస్తోంది. పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి మట్నదలుకొని మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలోని గంగూరు కూడలి వరకు మట్నత్తంగా 14 కి.మీ. మేర ఈ పైవంతెన నిర్మించాలని భావిస్తున్నారు. ఆరు వరుసలతో నిర్మించే ఫ్లై ఓవర్ కారణంగా హైవేలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలూ ఉండవని, విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడుతుందని అధికారులు యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్టును ఎలా చేపట్టవచ్చన్న భిన్న ప్రణాళికలపై ఢిల్లీ స్థాయిలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్చిస్తున్నారు.హైదరాబాద్- విజయవాడ- మచిలీపట్నం హైవే-65పై విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు మీదుగా ఈ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య ఎన్‌హెచ్-65ను నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రాజెక్ట్ చేపట్టారు. దీన్ని గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాలని ముందుగా భావించారు. ఆ తర్వాతా రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ దాకా విస్తరించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఒప్పుకుంది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. విజయవాడ-మచిలీపట్నం హైవేను ఆరు వరుసలుగా విస్తరించే ప్రాజెక్ట్ కూడా చేపడుతున్నారు. విజయవాడ నగర పరిధిలో కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాతి నుంచి కృష్ణలంక, వారధి జంక్షన్, స్క్రూబ్రిడ్జి, బెంజ్ సర్కిల్, కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు మీదుగా దావులూరు టోల్‌ప్లాజా వరకు నాలుగు వరుసలుగానే ఈ రహదారి మిగిలిపోనుంది. వాహన రద్దీ ఎక్కువగా ఉండే విజయవాడ నగరం మధ్యలో నాలుగు వరుసలుగా మిగిలిపోతే ఎలాగన్న ప్రశ్న తలెత్తింది. దీనికి విజయవాడలో ఆరు వరుసలతో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించడమే పరిష్కారమన్న అంచనాకు అధికారులు వచ్చారు. తద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు ఆరు వరుసలతో ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## కూటమిలో మిత్రుల మధ్యే పోటీ

**ఏలూరు, మార్చి 3, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఈసారి పోరు అధికార, ప్రతిపక్షాల మధ్య కంటే.. అధికార కూటమిలోని పార్టీల మధ్యే ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ, ఈ ఎన్నికలను బహిష్కరించే యోచనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తుపైనే పడింది. పైన నేతలు చేతులు కలిపినా, కింద కేడర్ మనసులు కలవడమే ఇప్పుడు అసలైన సవాల్‌గా మారింది.కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఈ సారి స్థానిక సంస్థల్లో సింహభాగం ఆశిస్తోంది. ఇటీవల రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి నేతలు కోనసీమ లాంటి ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో తామే పోటీ చేస్తామని బహిరంగంగా ప్రకటించడం కూటమిలో కలకలం రేపుతోంది. జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆ పార్టీ కేడర్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఫ్రెండ్లీ కాంటెస్ట్ పేరుతో అంతర్గత పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారుదశాబ్దాలుగా గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్న తెలుగుదేశం పార్టీకి, స్థానిక ఎన్నికలు చావో రేవో లాంటివి. తమ గ్రామంలో పట్టు కోల్పోవడానికి ఏ నాయకుడూ ఇష్టపడడు. సీట్ల సర్దుబాటులో భాగంగా తమకు పట్టున్న గ్రామాలను మిత్రపక్షాలకు కేటాయిస్తే, టీడీపీ కేడర్ తిరుగుబాటు చేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత క్షేత్రస్థాయిలో ఓటర్ల బదిలీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు ప్రశ్న.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కంటే బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకతను ప్రదర్శించాలని భావిస్తోంది. ఒకవేళ వైసీపీ బరిలో లేకపోతే, కూటమిలోని పార్టీలు ఒకరితో ఒకరు పోటీ పడటం ఖాయం. ప్రత్యర్థి లేని పోరాటంలో మిత్రపక్షాల మధ్య వైషమ్యాలు పెరిగి, అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఎమ్మెల్యేల స్థాయిలో కాకుండా, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారో వారికే కేటాయించడం. నియోజకవర్గ స్థాయిలోనే మూడు పార్టీల నేతలతో కమిటీలు వేసి వివాదాలు పరిష్కరించడం. స్థానిక సమస్యలపై కూటమి తరపున ఒకే అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయాల్సి ఉంది. కూటమి నాయకత్వం ఈ చిక్కుముళ్లను విడదీయకపోతే, స్థానిక ఎన్నికలు మిత్రపక్షాల మధ్య విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. అధికారాన్ని పంచుకోవడంలో చూపిన పరిణతిని, క్షేత్రస్థాయిలో సీట్ల పంపకంలో కూడా చూపిస్తేనే కూటమి ప్రయోగం విజయవంతమవుతుంది. లేనిపక్షంలో, ప్రత్యర్థి లేకపోయినా సొంత పార్టీల కుమ్ములాటలే కూటమికి అతిపెద్ద శత్రువులుగా మారతాయి.

## ఏపీ పేరు మార్పు రచ్చ...

**కాకినాడ, మార్చి 3, పెన్ పవర్:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రం పేరును మార్చిన సంగతి తెలిసిందే. అక్కడి ప్రజల కోరిక మేరకు కేరళం అని పేరు మార్చారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరును కూడా మార్చాలని డిమాండ్ మొదలైంది. గతంలో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించింది. తరువాత తెలుగు నాడుగా మార్చాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు కేరళ పేరు మార్పుతో తెలుగు నాడుగా ఏపీని మార్చాలన్న వాదన వినిపిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పేరు మార్పును ఊరుకోమని మరో వర్గం హెచ్చరిస్తోంది. అయితే తాజాగా ఈ తేనె తుట్టను కదిపారు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు. గతంలో ఎన్టీ రామారావు ఉమ్మడి ఏపీ ని తెలుగు నాడుగా మార్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ప్రముఖ ప్రవచన కర్తగా ఉన్నారు గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మికతతో పాటు చరిత్రను గుర్తుచేస్తూ ప్రవచనాలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో గతంలో ఏపీని తెలుగు నాడుగా మార్చేందుకు ఎన్టీఆర్ చేసిన ప్రయత్నాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు పదం కాదని.. ఆంధ్రప్రదేశ్ పేరులో తెలుగుదనం లేదు అని తేల్చేశారు. కేరళ వారికి ఉన్న పట్టుదల కూడా మనకు లేదని.. కేరళ ను కేరళంగా మార్చినట్టే.. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగు నాడుగా మార్చాలని గరికపాటి కోరారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరు మార్పు పై చర్చ మొదలైంది.
ఇదే అంశంపై భువనేశ్వరి పీఠాధిపతి స్వామి కమలానంద భారతి స్పందించారు. ఈ కొత్త చర్చ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే తెలుగు కాదా? రామాయణ కాలం నుంచి ఆంధ్రా అనే పదం ఉందంటూ ఆయన గరికపాటికి కౌంటర్ ఇచ్చారు. అడిగేవాళ్లు లేరని అధిక ప్రసంగాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా వింత పోకడలు, ఇంత ఆలోచనలు మంచిది కాదని.. తెలుగు నాడు అని మార్చినా ఎటువంటి సెంటిమెంటు ఉండదని.. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని విమర్శించారు. గరికపాటి తెలంగాణలో స్థిరపడ్డారని.. మా బ్రతుకులు ఎలా ఉండాలో మాకు తెలుసు అంటూ చురకలు అంటించారు. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలనే ఆలోచన ఇప్పటిది కాదు. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఆయన హయాంలోనే రాష్ట్రాన్ని తెలుగునాడుగా మార్చాలనే బలమైన ప్రతిపాదన వచ్చింది. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చలు జరిగాయి. కానీ అప్పట్లో రాజకీయ పరిణామాలు, రాజ్యాంగపరమైన ఇబ్బందుల వల్ల అది కార్యరూపం దాల్చలేదు.ఇప్పుడు వీరి మధ్య జరిగిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.

# రేషన్ షాపులోకందిపప్పు, రాగులు లేనట్లే..

**విజయవాడ, మార్చి 3, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి నెల ప్రారంభం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. అయితే విశాఖపట్నం, అల్లూరి జిల్లా రేషన్ కార్డుదారులకు మాత్రం ఈ నెలలో కందిపప్పుతో పాటుగా రాగులు పంపిణీ కూడా జరగడం లేదు. కందిపప్పు పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోగా.. గత మూడు నెలలుగా పంపిణీ చేసిన రాగులు కూడా విశాఖ, అల్లూరి జిల్లావాసులకు ఈసారికి అందుబాటులో లేకుండా పోయాయి.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. మార్చి ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యంతో పాటుగా అరకిలో పంచదార, కిలో గోధుమపిండి కూడా అందించనున్నారు. కొన్ని చోట్ల జొన్నలు, రాగుల పంపిణీ కూడా జరుగుతోంది. అయితే విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వంటి చోట్ల రాగుల పంపిణీ జరగడం లేదు. గత మూడు నెలలుగా రేషన్ కార్డుదారులకు రాగులను పంపిణీ చేశారు. అయితే మార్చి నెలలో మాత్రం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలిసిందిఅవసరాలకు తగిన మొత్తంలో రాగులు సరఫరా కాలేదని సమాచారం. ముఖ్యంగా ఒడిశా నుంచి రావాల్సిన రాగులు రాలేదని.. దీంతో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలలో రాగుల పంపిణీ జరగనట్లు సమాచారం. మరోవైపు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆదివారాలతో సహా రేషన్ షాపులు.. లబ్ధిదారులకు అందుబాటులో ఉండనున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, అలాగే సాయంత్రం



నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.మరోవైపు ఏపీలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నప్పటికీ.. కందిపప్పు సరఫరా మాత్రం జరగడం లేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీపై కందిపప్పు అందిస్తే మధ్యతరగతి జీవికి కాస్త ఊరటగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అయితే ఏపీలో కందిపప్పు పంపిణీ నిలిచిపోయి సుమారుగా ఏడాది కావొస్తోంది.బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.120 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు. రూ.67లకే అందించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా చేయాలని జనం కోరుతున్నారు. అయితే పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్ని నెలలు పాటు కందిపప్పు సరఫరా చేశారు. ఆ తర్వాత కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం ఊహాగానాలు



**విజయవాడ, మార్చి 3పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో నారా లోకేష్ సీఎం అనే చర్చ అప్పుడప్పుడూ తెరపైకివస్తోంది. ఇటీవలి కాలంలో లోకేష్ కు పట్టాభిషేకం చేస్తారన్న సోషల్ మీడియాలో తరచూ టాపిక్ వైరల్ అవుతోంది. నిజానికి లోకేష్ డిప్యూటీ సీఎం అనే ప్రచారం కొంత కాలం సాగింది. టీడీపీ నేతలు కూడా వరుసగా ప్రకటనలు చేశారు. కానీ ఇలాంటి ప్రకటనలు చేస్తే ఊరుకునేది లేదని హైకమాండ్ హెచ్చరించడంతో అందరూ సైలెంటు అయిపోయారు. కానీ ఇప్పుడు సీఎం చర్చ వస్తోంది. టీడీపీలో చంద్రబాబు తర్వాత లోకేష్ దే నాయకత్వం. చంద్రబాబు ఇప్పటికిప్పుడు వైదొలిగే అవకాశాలు లేవు. ఎందుకంటే చంద్రబాబుకు దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నాయి. గతంలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వినిపించింది. అప్పట్లో కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేసినప్పటికీ, పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని వారించడంతో ఆ చర్చ సద్దుమణిగింది. అయితే లోకేష్ సీఎం అనే చర్చ మళ్ళీ తెరపైకి రావడం వెనుక కేడర్‌లో ఉన్న ఉత్సాహమే ప్రధాన కారణం. యువగళం పాదయాత్ర ద్వారా తనను తాను నిరూపించుకున్న లోకేష్‌కు తగిన గుర్తింపు దక్కాలనేది అభిమానుల కోరిక. కానీ, పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా ఇలాంటి కీలక అంశాలపై అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానంలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అమరావతి నిర్మాణం. రాజధానిని ఒక కొలిక్కి తీసుకురావడమే తన జీవిత ఆశయమని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలన్నా మరో పదేళ్ల సుదీర్ఘ కాలం పడుతుందనేది వాస్తవం. ఇటువంటి క్లిష్ట సమయంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు పగ్గాలు వదిలిపెడతారనేది కేవలం ఊహ మాత్రమే. అమరావతి స్వప్నం సాకారం కాకుండా ఆయన సీఎం పీఠం నుంచి తప్పుకునే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారని, అక్కడ కీలక పదవి చేపట్టి రాష్ట్రంలో లోకేష్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే, చరిత్రను పరిశీలిస్తే చంద్రబాబు ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు. కింగ్ మేకర్‌గా తనకున్న లోక్ సభ ఎంపీల బలాన్ని ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించారు తప్ప, తన సొంత పదవుల కోసం వాడలేదు. 1990లలోనే ప్రధాని పదవినే కాదనుకున్న ఆయనకు, ఇప్పుడు కేంద్ర మంత్రి పదవులపై ఆసక్తి ఉంటుందనుకోవడం పొరపాటే అవుతుందని టీడీపీ వర్గాలంటున్నాయి నిజానికి టీడీపీలో చంద్రబాబు తర్వాత వారసుడిగా లోకేష్ నాయకత్వంపై ఎవరికీ సందేహాలు లేవు. కానీ అది ఎప్పుడు జరగాలి? ఎలా జరగాలి? అనేదానికి కాలమే సమాధానం చెబుతుంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గాసిప్స్ మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు పాలనపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది కాబట్టి, లోకేష్ పట్టాభిషేకం అనే అంశం ప్రస్తుతానికి కార్యరూపం దాల్చడం అసాధ్యమని టీడీపీ వర్గాలు క్లారిటీ ఇస్తున్నాయి.

# ఆర్సీబీ అభిమానులకు అదిరిపోయే శుభవార్త



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అభిమానులకు శుభవార్త. ఎన్నో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లకు వేదికైన బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ తిరిగి అడుగుపెట్టనుంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో ఆర్సీబీ తన ఐదు హోమ్ మ్యాచ్‌లను సొంతగడ్డపైనే ఆడనుంది.గత ఏడాది ఆర్సీబీ తన తొలి ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 11 మంది మరణించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు గాయపడ్డారు. నిర్వహణ లోపం వల్ల జరిగిన ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. విచారణ చేపట్టిన అధికారులు స్టేడియంలో కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. దీంతో ఆర్సీబీ మరో వేదికను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, ప్రస్తుతం భద్రతా చర్యలు మెరుగుపరచడం, ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించడంతో స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి లభించింది. అయితే, ఆర్సీబీ ఆడాల్సిన మిగిలిన రెండు హోమ్ మ్యాచ్‌లు మాత్రం ముందస్తు ఒప్పందం ప్రకారం రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతాయి.

ఈ విషయమై ఆర్సీబీ సీఈవో రాజేష్ మీనన్ మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. "చిన్నస్వామి స్టేడియం కేవలం మా హోమ్ గ్రౌండ్ మాత్రమే కాదు, మా జట్టు అస్తిత్వం

ఇక్కడి అభిమానుల కేరింతలు ఆటగాళ్లకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయి. మా అభిమానులు సొంతగడ్డపై మ్యాచ్‌లు చూసేందుకు అర్హులు" అని ఆయన పేర్కొన్నారు. టీ20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత ఐపీఎల్ 2026 పూర్తి షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

# ఐసీసీ సెమీస్ ప్యానెల్‌లో ఇద్దరు భారతీయులు.. భారత్-ఇంగ్లండ్ కీలక పోరుకు అంపైర్లు వీరే!

- టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్స్‌కు అంపైర్లను ప్రకటించిన ఐసీసీ
- భారత్-ఇంగ్లండ్ మ్యాచ్‌కు గఫానీ, పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లు
- దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ మ్యాచ్‌కు నితిన్ మెనన్ థర్డ్ అంపైర్
- మ్యాచ్ రిఫరీగా మరో భారతీయుడు జవగళ్ శ్రీనాథ్‌కు బాధ్యతలు
- గత సెమీస్‌లో భారత్ గెలిచినప్పుడు గఫానీ అంపైరింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంది. రేపు, ఎల్లుండి జరగనున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌ల కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అఫీషియల్స్ జాబితాను విడుదల చేసింది. ఈ ఎలైట్ ప్యానెల్‌లో భారత అంపైర్ నితిన్ మెనన్‌తో పాటు మాజీ క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్‌కు చోటు దక్కింది.ఈ నెల 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ఇంగ్లండ్ మధ్య జరగనున్న రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌కు క్రిస్ గఫానీ, అల్లావుద్దీన్ పాలేకర్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ థర్డ్ అంపైర్‌గా, పాల్ రీఫిల్ ఫోర్త్ అంపైర్‌గా, ఆండీ పైక్రాఫ్ట్ మ్యాచ్ రిఫరీగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. 2024లో ఇదే జట్ల మధ్య జరిగిన సెమీస్‌కు గఫానీ అంపైర్‌గా ఉన్నారు. ఆ మ్యాచ్‌లో భారత్ 68 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలోనూ గఫానీ భారత్ ఆడిన రెండు మ్యాచ్‌లకు, పాలేకర్ ఒక మ్యాచ్‌కు అంపైరింగ్ చేశారు.

ఇక, రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీ ఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా ఉంటారు. ఈ మ్యాచ్‌లో భారత అంపైర్ నితిన్ మెనన్ థర్డ్ అంపైర్‌గా కీలక బాధ్యతలు చేపట్టనున్నారు. రాడ్ టక్కర్ ఫోర్త్ అంపైర్‌గా, మరో భారతీయుడైన జవగళ్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీగా వ్యవహరించనున్నారు.రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా సెమీ ఫైనల్‌లో గెలిచిన మ్యాచ్‌కు ఇల్లింగ్‌వర్త్ అంపైర్‌గా వ్యవహరించగా, ఈ టోర్నీ గ్రూప్ స్టేజ్‌లో న్యూజిలాండ్ ఆడిన మ్యాచ్‌కు వార్ఫ్ అంపైరింగ్ చేశారు. దీంతో అత్యంత కీలకమైన సెమీస్ పోరులకు అనుభవజ్ఞులైన అఫీషియల్స్‌నే ఐసీసీ నియమించినట్లయింది.

# ఇండియా చేరుకున్న పీవీ సింధు.. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కు దూరం..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా దుబాయ్ ఎయిర్పోర్టులో చిక్కుకున్న ఇండియన్ స్టార్ బ్యాట్మింటన్ ప్లేయర్ పీవీ సింధు స్వదేశానికి చేరుకున్నారు. యుద్ధం కారణంగా దుబాయ్ ఎయిర్పోర్టు మూసివేయడంతో శనివారం నుంచి దుబాయ్ లోనే ఉండిపోయారు సింధు మంగళవారం ( మార్చి 3 ) ఉదయం దుబాయ్ నుంచి బెంగుళూరుకు చేరుకున్నారు. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కోసం బర్మింగ్ హామ్ బయలుదేరిన సింధు యుద్ధం కారణంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. దీంతో ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ కు దూరమయ్యింది.ఈ క్రమంలో ఇంటికి సురక్షితంగా చేరుకున్నానంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పీవీ సింధు. ప్రస్తుతానికి రెస్ట్ తీసుకొని ఆ తర్వాత భవిష్యత్ ప్రణాళికపై దృష్టి పెడతానంటూ ట్వీట్ చేశారు పీవీ సింధు. జరిగే ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్ షిప్ లో సింధు పాల్గొనడం లేదని ప్రకటించింది బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా. ఈ టోర్నీ కోసం మిగతా షట్లర్లు సింగపూర్, ఆఫ్రికా మీదుగా ప్రయాణించి బర్మింగ్ హామ్ కు చేరుకున్నారు. మెన్స్ షట్లర్లు లక్ష్యసేన్, ఆయుష్ షెట్టి ఎలాంటి ప్రయాణ సమస్యలు లేకుండా ఇంగ్లండ్ కు చేరారు.మెగా టోర్నీలో లక్ష్యసేన్, డబుల్స్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిపై ఇండియా అంచనాలు పెట్టుకుంది. అయితే లక్ష్య సేన్ కు తొలి రౌండ్లోనే వరల్డ్ నంబర్ వన్ షి యుకీ (చైనా) రూపంలో కఠిన సవాల్ ఎదురవనుంది. ఆయుష్.. అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో తలపడనున్నాడు.

# చీరకట్టులో గ్లామర్ డోస్ పెంచేసిన ప్రభాస్ బ్యూటీ!


బాలీవుడ్ సెన్సేషన్, నేషనల్ క్రష్ త్రిప్తి డిమ్రి తన అందచందాలతో మరోసారి ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇవి పాత జ్ఞాపకాలుగా మారకముందే అప్‌లోడ్ చేస్తున్నాను అంటూ షేర్ చేసిన చీరకట్టు ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది ఈ భామ. 'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన ఈ బ్యూటీ, ఇప్పుడు తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.



అనుక్రీతి వాస్ సోషల్ మీడియాను తగలబెట్టింది

**త్రిప్తి సక్సెస్ జర్నీ:**

త్రిప్తి డిమ్రి సినీ ప్రయాణం 2017లో 'పోస్టర్ బాయ్' చిత్రంతో మొదలైంది. ఆ తర్వాత వచ్చిన రొమాంటిక్ డ్రామా 'లైలా మజ్ను'లో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కేవలం అందానికే పరిమితం కాకుండా, ప్రతిభావంతురాలైన నటిగా గుర్తింపు తెచ్చుకుంది.ఇక 2021లో ఫోర్బ్స్ ఆసియా '30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించుకోవడం ఆమె కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయి. ఇక కష్టపడి పైకి వచ్చిన త్రిప్తి, ఇప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె ఎంపిక చేసుకునే కథలు, నటనలోని వైవిధ్యం ఫాన్స్ ను అలరిస్తున్నాయి. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలో తన అభిమానులను పలకరించడం త్రిప్తి మర్చిపోదు. తాజాగా ఆమె పోస్ట్ చేసిన చీరకట్టు ఫో టోలు ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి. ఫ్యాషన్ డ్రెస్ లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, చీరలో అంతటి హోయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇక ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు స్టన్నింగ్ బ్యూటీ అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. పాత జ్ఞాపకాలుగా మారకముందే తన అందాలను ఫ్యాన్స్‌కు షేర్ చేసి, మరోసారి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది ఈ స్పిరిట్ బ్యూటీ.



**ప్రభాస్ 'స్పిరిట్'లో త్రిప్తి:**

రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా సినిమాలంటేనే హీరో-హీరోయిన్ల మధ్య ఘాటు రొమాన్స్, బోల్డ్ సీన్స్ మరియు ఇంటెన్స్ లిప్ కిస్సులు ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక 'యానిమల్'లో తన గ్లామర్‌తో కుర్రాళ్ల గుండెల్లో సెగలు పుట్టించిన త్రిప్తి, ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఎలాంటి మ్యాజిక్ చేయబోతుందోనని ఫ్యాన్స్ అప్పుడే లెక్కలు వేస్తూ మూవీ కోసం ఎదురుచూస్తున్నారు.



సోనమ్ బజ్వా ఫ్లోరల్ కార్సెట్ గౌన్‌లో సొగసును ప్రసరిస్తుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965